PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్ సంపుటి : 01 సంచిక : 324 మంగళవారం, జూన్ 16 2026, పేజీలు - 5 వెల : 5 రూ/-

DK MEDIA

approved by Govt of INDIA, TELANGANA

OUR SERVICES

* NEWS PAPER * NEWS CHANNEL * DK GRAPHICS * DK ADS & PROMOTIONS * DK PRINTERS * DK PUBLICATIONS

WE'RE HIRING REPORTERS

for more details 9440711117, www.vishalajyothi.com

## సింగపూర్‌లో సీఎం చంద్రబాబు

# పెట్టుబడుల వేట.



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన నిమిత్తం సింగపూర్ చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు అక్కడ నివసిస్తున్న తెలుగు ఎన్నారైలు, స్థానిక కుటుంబాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికాయి. వారితో ముచ్చటించడం తనకు ఎనలేని సంతోషాన్ని ఇచ్చిందని చంద్రబాబు సామాజిక మాధ్యమం 'ఎ' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ, పలువురు ఐఏఎస్ అధికారులు, సీఆర్డీఏ బృందంతో కలిసి వెళ్లిన సీఎం.. ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యాన్ని కోరుతూ తొలిరోజే శరవేగంగా అడుగులు వేశారు.తొలిరోజు (జూన్ 15) -- హైకమి షనర్‌తో భేటీ, వాణిజ్య చర్చలు:పర్యటనలో భాగంగా ఉదయం 10:30 గంటలకు సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులేతో ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై ఇరు నేతలు చర్చలు జరిపారు.పెట్టుబడులకు ఆహ్వానం: ఏపీలో ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ అంతర్జాతీయ పెట్టుబ డిదారులను, సింగపూర్ సంస్థలను చంద్రబాబు ఆహ్వానించారు. ముఖ్య ంగా ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి), సెమీకండక్టర్ చిప్ తయారీ, నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), విమాన నిర్వహణ (వీ=ా) కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించారు.కీలక భేటీలు: స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. యూఎన్-హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్‌బాచ్‌తో కలిసి మీటింగ్‌లో పాల్గొన్నారు.గ్లోబల్ లీడర్లతో డిస్కషన్స్: గూగుల్ క్లౌడ్ ఏషియా-పసిఫిక్ ప్రతినిధి కరణ్ బజ్వా, జీఐసీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గువాన్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ ఎంగ్ చైలతో చంద్రబాబు సమావేశమై విద్యా, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని కోరారు.ప్రభుత్వ పెద్దలతో భేటీ: సింగపూర్ ప్రధా నమంత్రి లారెన్స్ వాంగ్, విదేశాంగ మంత్రి డాక్టర్ వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి కె. షణ్ముగం, మానవ వనరుల శాఖ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్‌లతో సీఎం చంద్రబాబు బృందం భేటీ అయింది. సింగపూర్ అవసరాలకు తగినట్లుగా ఏపీ యువతను స్కిల్డ్ హ్యూమన్ రిసోర్స్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని సీఎం వారికి స్పష్టం చేశారు.సెమీకండక్టర్స్ ఉ అమరావతి చర్చలు: ఏపాక్ సెమీకండక్టర్ రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొనడంతో పాటు, అమరావతి రాజధాని నగర ప్లానింగ్‌కు సంబంధించి 'సుర్బానా జురాంగ్' ప్రతినిధులతో అత్యంత కీలకమైన సమీక్ష జరుపుతారు. అనంతరం డిప్యూటీ పీఎం గన్ కిమ్ యాంగ్‌తో సమావేశమవుతారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి



**రాజస్థాన్:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. నీట్‌తో సహా వివిధ జాతీయ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జయపురలో సీజేపీ ఆందోళనలు చేపట్టింది. ఈ ఆందోళనలో పాల్గొన్న అభిజిత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. అతని చెంపపై కొట్టారు. అభిజీత్‌ను కొట్టిన వ్యక్తులపై సీజేపీ కార్యకర్తలు మూకుమ్మడి దాడి చేశారు. "సీజేపీ నిరసన ప్రదర్శన సమయంలో కొందరు వ్యక్తులు అభిజీత్? దీప్కేపై దాడి చేసి, చెంపదెబ్బలు కొట్టారు. దీప్కే ( ఆయనను తమ భుజాలపై మోసుకెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. దాడి చేసిన వారిలో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నాం. తదుపరి విచారణ కొనసాగుతోంది" పోలీసులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణపై

# కేంద్రం వివక్ష



**హైదరాబాద్, జూన్ 15:** తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర (మీఎా), ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు..

# తరుణి సంస్థతో ఎంఓయూ




**హైదరాబాద్, జూన్ 15 :** తెలంగాణలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ - తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.'బాల్య వివాహం -- బతుకు ఆగం' నినాదంతో అవగాహన..'బాల్య వివాహం బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని మంత్రి సీతక్క తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.అధికారులకు ప్రత్యేక శిక్షణ.. అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## కిషన్‌రెడ్డి వల్లే మెట్రో సెకండ్ ఫేజ్‌కు

# నిధుల విషయంలో ఇబ్బందులు

- హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే మెట్రో రైలు నిర్మాణం
- రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ ఒప్పుకోలేదని వివరించారు.ఎలాంటి గ్యారెంటీ లేకుండా అప్పుగా ఇచ్చారు : రూ.30 వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.కిషన్‌రెడ్డి వల్లే మెట్రోకు ఇబ్బందులు : ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి 4 శాతం వడ్డీకి రూ.13,600 కోట్ల రుణం ఇప్పించామని సీఎ తెలిపారు. బ్యాంకుల అప్పులకు రేవంత్ రెడ్డికి తేలికగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఇబ్బందులు వస్తాయని కిషన్‌రెడ్డియయ ఖట్టర్, అశ్వినీకి చెప్పారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఖట్టర్, అశ్వినీకి చెప్పాకే సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.

## అమరవీరులను గుర్తించేందుకు

# 12 సంవత్సరాలు సరిపోలేదా?



**న్యూ ఢిల్లీ :** తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని ఆ పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరో సారి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్?ను విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వెలిబుచ్చానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని విభజించిన నాటి నుంచి ఇవాళ్టికి కాంగ్రెస్ ధోరణి మారలేదని, కాంగ్రెస్ విభజన తీరు అసంతృప్తిని, అశాంతిని సృష్టించిందని పేర్కొన్నారు. దిల్లీలో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు. అమరవీరులను గుర్తించేందుకు 12 సంవత్స రాల సరిపోలేదా? : తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించేందుకు బయల్దేరితే రాష్ట్ర ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఇండియా గేట్‌కు వెళ్లి సైనికులకు వందనం చేయాలంటే కశ్మీర్, పంజాబ్‌లో పుట్టాలా? అని ప్రశ్నించారు. తనకు స్ఫూర్తినిచ్చిన నేల తెలంగాణ అని స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1200 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. ఒక నేల కోసం ఇంతలా ఆత్మబలిదానాలు చేసుకుంటారా? అనిపించిందని, అందుకే వారంటే తనకు గౌరవమని తెలిపారు.యువతను బలిచేసి నేతలు గద్దెనెక్కారని అన్నారు. అమరవీరులను గుర్తించేందుకు 12 సంవత్సరాల సరిపోలేదా? ప్రశ్నించారు. ఏ ఆశయాల కోసం తెలంగాణ వచ్చిందో దాని కోసం జనసేన తన వంతు కృషి చేస్తుందని మనస్ఫూర్తిగా మాటిస్తున్నానని హామీ ఇచ్చారు. పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని నేతలు, కార్యకర్తలు నిలబడాలని కోరారు.

# తెలంగాణలో భారీ వర్షాలు

## అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు



**హైదరాబాద్, జూన్ 15:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు.విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ వచ్చినా సింగరేణిలో

# పరిస్థితి మారలేదు



**మంచిర్యాల, జూన్ 16:** మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా హరీశ్ రావు మాయలో పడ్డారన్నారు. హరీశ్‌రావు లేఖ రాయగానే.. కిషన్‌రెడ్డి వెంటనే మరో లేఖ రాశారని తెలిపారు. తెలంగాణలో ఓపెన్ కాస్ట్‌లతో సమానంగా అండర్ గ్రౌండ్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు.తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సింగరేణిలో పరిస్థితి మారలేదని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులపై అత్యంత కర్కశంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ప్రశ్నించే కార్మికులను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికీ కారణం ప్రభుత్వ అలసత్వమే అని మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించారని.. కానీ కార్మికుల సమస్యలను తెలుసుకోలేదన్నారు. భట్టి విక్రమార్క పర్సంటేజ్‌లు తీసుకోవడం మానేయాలని.. ఆ తర్వాతే ప్రతిపక్షాలపై విమర్శలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 2012లో బొగ్గు స్కామ్ చేసిందని టీఆర్ఎస్ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. సింగరేణి కూడా వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

## ఈత చెట్ల ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** రెబ్బెన మండలం, గోలేటి గ్రామానికి చెందిన సంఘం శంకర్ (తండ్రి: సంఘం బానయ్య) అనే వ్యక్తి అమీన్ గూడెం సమీపంలో సుమారు 20 ఈత చెట్లను ప్రొక్లైన్ యంత్రంతో కూల్చివేసి అనంతరం కాల్చివేసిన ఘటనపై గోలేటి గీత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గోలేటి గౌడ సంఘం అధ్యక్షులు కొయ్యడ రవి గౌడ్ కేసరి సాయ గౌడ్ కేసరిరమేష్.గౌడ్. మాట్లాడుతూ ఈత చెట్లు గీత కార్మికుల జీవనాధారమని, వాటిని అక్రమంగా ధ్వంసం చేయడం వల్ల అనేక మంది గీతకార్మికుల ఉపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ చెట్లను కూల్చివేయడానికి ఉపయోగించిన ప్రొక్లైన్ యంత్రాన్ని వెంటనే సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరారు. గీత వృత్తిని ఆధారంగా చేసుకుని జీవిస్తున్న కార్మికుల హక్కులు, జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



**తొర్రూరు, విశాలజ్యోతి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవం ఉన్న అధ్యాపకులు పాఠాలు బోధిస్తారని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం కళాశాలలో అందుతుందని తెలిపారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన అనేకమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. అందుకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగల నారాయణ, అధ్యాపకులు సువర్ణ, అన్నపూర్ణ, ఉప్పలయ్య, నరసయ్య, మల్లయ్య, శివరామకృష్ణ, అనిత, రాజేష్, నాగరాజు, కమల్ దీప్, రాంబ్రహ్మాచారి, అలీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**హైదరాబాద్ విశాలజ్యోతి:** హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ గారితో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం మరియు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అల్పాహారం మరియు పాలు పంపిణీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు, పాఠశాలలకు హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షలకు సర్వం సిద్ధం



- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** జిల్లాలో నిర్వహించనున్న టీజీ టెట్ జూన్--2026 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16 నుండి జూన్ 22 వరకు మొత్తం ఐదు రోజుల పాటు పది సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,217 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచలోని అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ ఇంటర్నెట్ తాగునీరు భద్రతా ఏర్పాట్లు వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్‌తో పాటు సంబంధిత గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

పరీక్షలను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షా నిబంధ నలను తప్పనిసరిగా పాటించి విజయవంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు.

## సింగరేణిలో సమ్మెకు సిద్ధంగా ఉండండి



- 22 తర్వాత ఎప్పుడైనా సమ్మె బాట
- గుర్తింపు సంఘం హెచ్చరిక

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (విశాల జ్యోతి):** సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సంస్థను స్తంభింపజేసే స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. సోమవారం పీవీకే–5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించవద్దన్నారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు అలియాస్ పేర్ల మార్పులు పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు సొంత ఇంటి స్థలాల కేటాయింపు డిపెండెంట్ ఉద్యోగాలు వంటి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని పేర్కొన్న ఆయన కార్మికులు ఐక్యంగా ఉంటే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు కొత్త గనుల ప్రారంభం సంస్థ విస్తరణతో పాటు భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లు అమలు కాకపోవడానికి రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరి కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతాయని అవసర మైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడ బోమని మిరియాల రంగయ్య స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులతోపాటు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్య, పలువురు యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## పాలనలో బహుజన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలి



- రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క

**హైదరాబాద్ విశాలజ్యోతి:** జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు సంబంధించి పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క ఆధ్వర్యంలోని బృందం రిటైర్డ్ ఎంఆర్వో డీఎల్ నర్సయ్య గారిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ సందర్భంగా బహుజన వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం, పరిపాలనా వ్యవస్థలో వారి భాగస్వామ్యం, సామాజిక న్యాయం సాధన వంటి అంశాలపై చర్చించారు. రాజ్యాధికార సమరభేరి సభ లక్ష్యాలను వివరించి సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ సందర్భంగా పటేల్ వన జక్క మాట్లాడుతూ, సమాజంలో మెజారిటీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు పాలనా వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం దక్కినప్పుడేని జమైన ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని అన్నారు.

ప్రజల సమస్యలను అర్థం చేసుకున్న శ్రమజీవి వర్గాల బిడ్డలు నిర్ణయాధికార స్థానాల్లోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బహుజన వర్గాల రాజకీయ సాధికారత కోసం నిరంతరం పోరాడుతోందని, రాజ్యాధికార సమరభేరి సభ ఆ లక్ష్య సాధనలో కీలక ఘట్టమని తెలిపారు.

జులై 05న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభకు ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగ విరమణ పొందిన అధికా రులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్, అర్కటి శ్రీనిధి, అర్కటి పావని, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి



- జిల్లా విద్యాశాఖ ఏడీ శంభూ ప్రసాద్‌కు టీయూడబ్ల్యూజే (టీజెఎఫ్) వినతి
- జర్నలిస్టుల పిల్లల పేరు మీద ఆయా పాఠశాలకు ఆదేశాలు జారీ చేస్తామని ఏడీ హామీ..
- జర్నలిస్టుల హర్షం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** జర్నలిస్టుల పిల్లల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వారి చదువులకు ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (టీజెఎఫ్)హెచ్ -143 యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, ఎండి షఫీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ ఏడీ శంభూ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సమాచారాన్ని అందించే క్రమంలో జర్నలిస్టులు ఎన్నో సవాళ్లను ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న విద్యా ఖర్చుల కారణంగా జర్నలిస్టుల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎయిడెడ్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఈ అంశంపై సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ ఏడి సానుకూల స్పందన.. జర్నలిస్టుల వినతిపై జిల్లా విద్యాశాఖ ఏడీ శంభూ ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీకి సంబంధించి జిల్లాలోని ఆయా పాఠశాలకు జర్నలిస్టుల పిల్లల పేరు మీద త్వరలోనే స్పష్టమైన ఆదేశాలు(ఆర్డర్స్) జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యాశాఖ ఏడీ ఇచ్చిన ఈ హామీ పట్ల టీయూడబ్ల్యూజే నాయకులు స్థానిక జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజెఎఫ్) హెచ్–143 యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అచ్చి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కాగితపు వెంకటేశ్వర్లు, టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, ప్రతినిధులు కృష్ణారావు, ప్రవీణ్, శామ్, నరేష్, సూరి, ఫహీమ్, సురేష్, మొగిలి, రాము, షకీల్, రబ్బాని, రాందాస్, లక్ష్మణ్, మురళితో పాటు పలువురు మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం




- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుండి వినతులు ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు భూ సమస్యలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి మౌలిక సదుపాయాలు రెవెన్యూ ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజావాణిలో అందిన కొన్ని వినతులు మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తె దివ్యశ్రీ ఆరో తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసినప్పటికీ సీటు రాలేదని తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేదని పేర్కొంటూ గురుకుల పాఠశాలలో సీటు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిపై తగు చర్యల కోసం ఆర్‌సీఓ సోషల్ వెల్ఫేర్‌కు ఎండార్స్ చేశారు. సుజాతనగర్ మండలం చిమ్మ తండా గ్రామానికి చెందిన భూక్య సేవ తన తండ్రి 2010 లో మరణించారని మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు మీ సేవలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురవుతోందని తెలిపారు. ఈ కారణంగా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుపై మార్చుకోలేకపోతున్నానని సమస్య పరిష్కరించి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన స్వప్న తనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని పూర్తిగా వర్షాధార సాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నానని బోరు విద్యుత్ సదుపాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష తనకు సంబంధించిన రెండు వేర్వేరు భూముల భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత ధరణి అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్య వైద్య రంగాలకు సీఎస్ఆర్ నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి




- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాలజ్యోతి):** జిల్లాలో విద్యా వైద్య రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ నిధుల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన కొత్త పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏరియా ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాలల్లో తరగతి గదుల అభివృద్ధి ఫర్నిచర్ తాగునీటి సదుపాయాలు పారిశుద్ధ్య వసతులు డిజిటల్ విద్యా సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులు ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు మౌలిక వసతులు రోగుల సౌకర్యాల కల్పనకు పరిశ్రమలు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు అవసరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందుతున్న వినతులు ఫిర్యాదులు స్థానిక అవసరాల ఆధారంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేసి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా అమలు చేయాలని చెప్పారు. గిరిజన గుత్తికోయ ప్రాంతాల్లో విద్య వైద్యం తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన కలెక్టర్ జిల్లాలోని అన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అన్నారు. సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులు తమ సంస్థల ద్వారా ఇప్పటివరకు చేపట్టిన సీఎస్ఆర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించగా భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై చర్చించారు.

ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు సంబంధిత శాఖల అధికారులు వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# గ్రామపంచాయతీ కార్మికుల కనీస వేతనాలకై ధర్నా



తొర్రూరు విశాలజ్యోతి: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ అనుబంధం ఎ-106 ) ఆధ్వర్యంలో నేడు తొర్రూర్ ఎండిఓ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎండిఓ వెంకటేశ్వర్లకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 60 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులపై సవితి తల్లి ప్రేమ చూపుతోందని అన్నారు. చాలీచాలని జీతాలతో 12,000 గ్రామపంచాయతీలలో కొట్లాదిమంది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ క్రొవత్తిలా కరిగిపోతున్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచకపోవడం సరికాదని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీవో నెంబర్ 60 దారా నాలుగు కేటగిరీలుగా విభజించి వేతనాలు పెంచిన గ్రామపంచాయతీ కార్మికులకు అందులో స్థానం లేదని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 6న విడుదల చేసి మూడు కేటగిరీలుగా చేసి కోటి 11 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచి జీవితాల్లో వెలుగును నింపావని చెప్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామపంచాయతీ కార్మికులు కనిపించకపోవడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే జీవో నెంబర్ 60 ప్రకారం లేదా 6 ప్రకారం వేతనాలను పెంచాలని రవి డిమాండ్ చేశారు.

పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ భవిష్యత్తు జీవితానికి భరోసా కల్పించాలని ఆయన కోరారు. మూడు నెలల వేత నాలు పెండింగ్ ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యూనియన్ జిల్లా అధ్యక్షులు పాడియా బీకు, రాష్ట్ర నాయకులు గాదరబోయిన సంతోష్ మండల అధ్యక్షుడు గుండాల సోమ నర్సయ్య టియు సిఐ తొర్రూరు ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం పుల్లయ్య, ఎండి షరీఫ్‌తో పాటు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ప్రమోదు శ్రీధర్ రాము క్రాంతి వెంకన్న శిరీష తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు స్పందించిన ఎంపీడీవో పెండింగ్ జీతాలను వెంటనే అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# జీవో 1195 ను వెంటనే అమలు చేయాలి



- ప్రభుత్వానికి రామ రాజేష్ ఖన్నా విజ్ఞప్తి.

హైదరాబాద్, విశాలజ్యోతి: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనాకి ప్రభుత్వం జారీ చేసిన 1195 జీవోను ఆర్థిక శాఖ ఆమోదం పొంది 11 నెలలు గడుస్తున్న అమల్లోకి రాలేదు, తక్షణమే అమలు చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం 1195 జీవో విడుదల చేసి 11 నెలలు గడుస్తున్నా, నేటికీ క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు పెరిగిన వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా వేతన జీవులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పెరిగిన వేతన బకాయిలను, ఏడు నెలల పి.ఆర్.సి. ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. జీవో నెంబర్ 1195 అమలు పై కొంతమంది ఉద్యోగులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం అది పెండింగ్లో ఉందని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల సంక్షేమం, సేవా,భద్రత, వేతనాల పెరుగుదలపై అనేక హామీలు ఇచ్చిన నేపథ్యంలో, ఉద్యోగుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన ఈ జీవో 1195 అమలులో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ సాంకేతిక కారణాలను సాకుగా చూపకుండా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా (లేదా) కోర్టు ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని, వచ్చే 2026 ఆగస్టు15 లోపు కొత్త వేతనం అమల్లోకి తీసుకొచ్చి కొత్త వేతనాలు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఇచ్చే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## చేపలు పట్టే బెస్త,ముదిరాజ్ అన్నల్లే మన సభకు ముఖ్య అతిథులు



- చెరువు వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేత
- పాల్గొన్న టీఆర్పీ వుమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజా గౌడ్

పోచంపల్లి, విశాలజ్యోతి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భువనగిరిలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సోమ శ్రీను గారిని కలిసి మహాసభకు ఆహ్వానం అందజేశారు.ఐతే సోమ శ్రీను గారు తమ సంఘ సభ్యులతో కలిసి స్థానిక చెరువులో చేపలు పడుతున్న క్రమంలో నేరుగా చెరువులోకి దిగి వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నీరజ గౌడ్ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు, బీసీ వర్గాల రాజకీయ సాధికారత అవసరం, రాజ్యాధికార లక్ష్యాలపై వారితో చర్చించారు. సమాజంలోని ప్రతి వర్గం పెద్ద సంఖ్యలో భువనగిరి సభకు హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి మహిళ అధ్యక్షురాలు శాలిని గారు, కార్యదర్శి వనజ గారు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల అరాచకానికి అడ్డుకట్ట ఎప్పుడు..?



- ఫీజుల దోపిడీతో తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్న విద్యా మాఫియా...
- నిబంధనలు గాలికొదిలి హోర్డింగుల హంగామా -- మొద్దు నిద్రలో విద్యాశాఖ...
- అక్రమ హోర్డింగులు, టౌన్ ప్లాన్ అధికారులపై ప్రజావాణిలో టీఆర్పీ ఫిర్యాదు...
- ఫీజుల దోపిడీని అరికట్టలేని ప్రభుత్వం విద్యార్థులకు ఏం న్యాయం చేస్తుంది...?
- చర్యలు తీసుకోకుంటే తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తాం....
- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా....

కరీంనగర్, విశాలజ్యోతి: కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నప్పటికీ ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ అనేక ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫార్ములు మరియు ఇతర పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మరోవైపు విద్యార్థుల పరీక్షా ఫలితాలను నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల రూపంలో ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించి అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అక్రమ హోర్డింగులపై మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ మరియు టౌన్ ప్లాన్ అధికారులు చర్యలో తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ అక్రమాలన్నీ కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని అఖిల్ పాషా మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగానే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ హోర్డింగులు ఏర్పాటు చేసి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు మరియు తల్లిదండ్రుల ఆర్థిక భారం దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని, లేదంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అఖిల్ పాషా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక లావణ్య, జిల్లా అధ్యక్షు లు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు ఓర్సు రాజు, అమ్మిగళ్ల కుమార్, ఓర్సు విమల తదితరులు పాల్గొన్నారు.

# "కో-లివింగ్ సంస్కృతిని ప్రోత్సహించరాదు

- భారతీయ సంస్కృతికి గొడ్డలిపెట్టు.
- సమాజానికి తీవ్ర విఘాతం.
- ముక్తకంఠంతో వ్యతిరేకించాలి.

తొర్రూరు, విశాలజ్యోతి: అవివాహితులైన అబ్బాయి మరియు అమ్మాయి ఇరువురూ తమ అంగీకారంతో ఒకే రూములో కలిసి నివసించే కో-లివింగ్ అనే ఈ కొత్త సంస్కృతి మన సమాజానికి, భారతీయ సంస్కృతికి గొడ్డలిపెట్టు లాంటిదని అందుచేత దీనిని ఎవరూ ప్రోత్సహించరాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి పిలుపునిచ్చారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం నాడు దొనికెన విలేఖరులతో మాట్లాడుతూ భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో సమస్యలు ఉండగా, మరో వైపు దేశంలో రోజురోజుకూ పేట్రేగిపోతున్న పాశ్చాత్య సంస్కృతుల్లో ఇప్పుడు మరో కొత్త సామాజిక సమస్య "కో-లివింగ్" సంస్కృతి చేరిందని, ఇది ఎంత మాత్రం ఆరోగ్యకరమైంది కాదని, ఆమోదయోగ్యం కాదని, దీనిని ఎవరూ అనుమతించరాదని దొనికెన అన్నారు. ఉద్యోగ నిమిత్తమనీ, పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికనీ, ఉన్నత విద్య కోసమనీ ఇలా రకరకాల కారణాలతో వివిధ దేశాలు, మన దేశంలోని రాష్ట్రాలు మరియు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వచ్చి నివసించే క్రమంలో అపరిచితులైనవారు గానీ పరిచయస్తులైనవారు గానీ అవివాహిత యువతీ యువకులు తమ తల్లిదండ్రులను మభ్యపెట్టి, తప్పుడు సమాచారం ఇచ్చి, వారికి తెలియకుండా ఒకే రూములో కలిసి ఉంటున్నారని కుమారస్వామి అన్నారు. ఇట్టి విషయంలో తల్లిదండ్రులు మేల్కొని అప్రమత్తంగా వ్యవహరించాలని, అప్పుడప్పుడు వారికి తెలియకుండా వచ్చి పరిశీలించాలని, అనుమానాస్పదంగా గోచరిస్తే తగు విధంగా హెచ్చరించాలని దొనికెన సూచించారు. ఆయా నగరాల్లో దీనిని వ్యాపారంగా చేసేవారు పునరాలోచించుకొని ఇలాంటి కేంద్రాలను, హాస్టల్లను, వసతి గృహాలను వెంటనే మూసివేసి, ఇతర సమాజ హిత వ్యాపారాలు చేసుకోవాలని తెలిపారు.

ఇలాంటి వ్యాపారాలకు అనుమతులు మంజూరు చేసే సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి, ఇకముందు ఇలాంటి వసతి గృహాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటి వరకు అనుమతులతో గానీ, అనుమతులు లేకుండా గానీ నడుపబడుతున్న సంస్థలు, వ్యక్తులు, ఆర్గనైజ్ చేసే యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, ఈ కో- లివింగ్ సెంటర్లను సాధ్యమైనంత తొందరగా మూయించాలని లేనిచో సమాజంలో విష సంస్కృతి పెరిగిపోయి, ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉన్న భారతీయ సంస్కృతికి భంగం వాటిల్లుతుందని, మన సమాజం విచ్చిన్నమయ్యే అవకాశం ఉంటుందని అందువల్ల ఈ వ్యాపారాన్ని ముందు ముందు కొనసాగకుండా చూడాలని సంబంధిత అధికారులకు దొనికెన విజ్ఞప్తి చేశారు.

# యూరియాకు సంబంధించిన ఫెర్టిలైజర్ యాప్ ఓపెన్‌గా ఉంది

- కావలసిన రైతులు యాప్‌లో బుక్ చేసుకోవాలి
- మండల వ్యవసాయ శాఖ అధికారి వాహిని

విశాలజ్యోతి (దంతాలపల్లి) దంతాలపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు యూరియాకు సంబంధించి ఫర్టిలైజర్ ఆప్ ఓపెన్ అయి అందుబాటులో ఉన్నది యూరియా కావలసిన రైతు సోదరులందరూ మీ గూగుల్ ప్లే స్టోర్ నుండి ఫర్టిలైజర్ ఆప్ నీ డౌన్లోడ్ చేసుకుని మీ పంట వివరాలను (కల్టివేషన్ డీటెయిల్స్) ను నమోదు చేసుకొని యూరియా బస్తాలను బుక్ చేసుకోవాలి అని మండల వ్యవసాయ శాఖ అధికారి వాహిని సూచించారు. పట్టాదార్ పాస్ పుస్తకానికి లింక్ అయిన ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది అన్నారు.పంటల వారీగా మరియు దఫాల వారీగా యూరియా బస్తాలు రైతులకు అందించబడతాయి అని తెలిపారు .ఒక ఎకరానికి రెండు బస్తాల వరకు యూరియా వచ్చే అవకాశం ఉంటుంది. ఎవరికైనా మీ మొబైల్ నెంబర్స్ లింక్ కానిచో మీ సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి వద్ద లింకు చేపించుకోవడానికి అవకాశం కల్పించామన్నారు.ఈ విషయంలో ఏ విధమైన సందేహాలు ఉన్నా మీ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవలని సూచించారు.

## హోంగార్డ్ అయిన భార్యను..

### పిల్లల ఎదుటే కత్తితో పొడిచి చంపిన భర్త

బెంగళూరు: పోలీస్ శాఖలో హోంగార్డ్‌గా పని చేస్తున్న భార్యను ఒక వ్యక్తి హత్య చేశాడు. అత్త, పిల్లల ఎదుట కత్తితో పలుమార్లు పొడిచి ఆమెను చంపాడు. ఆ తర్వాత అదే కత్తితో గాయం ర్చుకునేందుకు ప్రయత్నించాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. 32 ఏళ్ల మంజుల, మహదేవపుర పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డుగా విధులు నిర్వహిస్తున్నది. 15 ఏళ్ల కిందట ప్రదీప్‌తో ఆమెకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కాగా, ప్రదీప్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటు ఉన్నది. దీనివల్ల భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.

అలాగే మంజుల ప్రవర్తనను ప్రదీప్ అను మానించేవాడు. పిల్లల తండ్రి ఎవరంటూ సందేహం వ్యక్తం చేసేవాడు.

భర్త వేధింపులు భరించ లేని మంజుల నెలన్నర రోజులుగా తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఇంట్లో నివసిస్తున్నది. మ రోవైపు ఆదివారం ప్రదీప్ ఆ ఇంటికి చేరుకున్నా డు. తనను క్షమించి ఇంటికి తిరిగి రావాలని భార్య మంజులను బతిమాలాడు. ఆమె కాళ్లపై పడి తన ప్రవర్తనకు క్షమాపణలు చెప్పాడు. ఆ తర్వాత ఒక్కసారిగా హింసాత్మకంగా మారిపో యాడు. అత్త, ఇద్దరు పిల్లల కళ్ల ముందే మం జులను 20 సార్లకు పైగా కత్తితో పొడిచి చంపా డు.

ఆ తర్వాత అదే కత్తితో తన చేతిని కోసుకు నిహాని కలిగించుకు నేందుకు అతడు ప్రయత్నించాడు.

అయితే భార్య మంజుల హత్యకు ముందు ప్రదీప్ ఒక వీడియో మెసేజ్‌ను రికార్డ్ చేశాడు. తన బెట్టింగ్ వ్యసనం తన కుటుంబాన్ని నాశనం చేసిందని అతడు అంగీకరించాడు. 'నా భార్య లకుండా నేను ఉండలేను.

ఆమె తండ్రి, బావమరిదితో నేను మాట్లాడాను. సాయంత్రం పని ముగించుకుని ఆమె తిరిగి వస్తుంది. నాతో వచ్చేయమని మళ్లీ అడుగుతా. ఒకవేళ రానని చెబితే, అక్కడే ఆమెను చంపేస్తా' అని ఆ వీడియోలో పేర్కొన్నాడు.

పోలీసులు దీనిని పరిశీలించారు. నిందితుడు ప్రదీప్‌ను అరెస్ట్ చేశారు.

అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.


# ఎస్పీ అక్షాంశ్ యాదవ్‌ను కలిసిన టీ.ఆర్.పీ నాయకులు




యాదాద్రి భువనగిరి జిల్లా, విశాలజ్యోతి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకత్వం విస్తృత స్థాయిలో సన్నాహాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో భువనగిరి జిల్లా ఎస్పీ ఐపీఎస్ అక్షాంశ్ యాదవ్ గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ గారి నేతృత్వంలో టీ.ఆర్.పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సభ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలకు సౌకర్యాలు వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకానున్నందున, భద్రతా పరంగా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సభ ప్రాంగణంలో శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని నాయకులు ఎస్పీ గారిని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ సభను శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పరిపాలన యంత్రాంగంతో పూర్తి సమన్వయం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదేల్ యాదవ్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ అనిల్ వీరమల్లు,భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమరశెట్టి నరసింహులు, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, సుతారపు రంగయ్య,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు షాలిని, ఉపాధ్యక్షురాలు సౌభాగ్య, కార్యదర్శి వనజ,సుశీల తదితరులు పాల్గొన్నారు.

## యువత కలల్ని అణిచివేశారు.. కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్..

# 'కోట'లో నిరసనలకు రావాలని పిలుపు



దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, ఉద్యోగ నియామకాల్లో ఆలస్యాన్ని నిరసిస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిరసన చేపట్టనున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా మొదట రాజస్థాన్‌లోని కోట పట్టణంలో రాహుల్ ఆందోళన చేపట్టనున్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు తరలిరావాలని రాహుల్ పిలుపునిచ్చారు. ఈ నెల 17, బుధవారం నాడు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీతోపాటు కాంగ్రెస్ నేతలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొంటారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. దేశంలోని విద్యార్థులు, యువత, నిరుద్యోగుల కలల్ని కేంద్రం అణిచివేస్తోందన్నారు. యువతకు సమాన అవకాశాలు అందడం లేదని, పరీక్షల నిర్వహణలో అస్థిరత వల్ల ఏళ్లతరబడి విద్యార్థుల శ్రమ, సాధన వృథాగా పోతున్నాయన్నారు. వ్యవస్థలో వైఫల్యం, నియామకాల్లో లోపాల కారణంగా ఎందరో నిరుద్యోగులు, ఆశావహులు ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ విమర్శించారు. పేపర్ లీక్ కావడం, మళ్లీ పరీక్ష నిర్వహించడం, నియామక ప్రక్రియ ఆలస్యం కావడం పరిపాలనా వైఫల్యంకంటే.. యువత భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. ఈ పరీక్షల కోసం వాళ్లు ఏళ్లతరబడి కఠోర సాధన చేస్తారని గుర్తు చేశారు. అంత కష్టపడ్డ వారు అవకాశాలు పొందలేక.. నిరాశ, నిస్పృహలోకి వెళ్తున్నారని రాహుల్ గుర్తు చేశారు. అధికారంలో ఉన్నవాళ్లు వీటిని వినలేనప్పుడు.. ప్రజలు తమ గొంతుకను మరింత గట్టిగా వినిపించాలి.

సమష్టిగా స్పందించాలి" అని రాహుల్ కోరారు.దేశ యువత కోసం, వారి భవిష్యత్ కోసం ఈ ఉద్యమాన్ని నడుపుతున్నట్లు రాహుల్ వెల్లడించారు. జూలై 14 వరకు రాహుల్ పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక



# రాయన్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు

## చేపట్టాలి పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్, జూన్ 15 :** మెదక్ మండలంలోని రాయన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వలో దెబ్బ తిన్న దోని, చెరువు తూముల మరమ్మతులు వెంటనే చేపట్టాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రాయన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వలోని దోని కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.
ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని, అయితే సంవత్సరం గడిచినా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హై లెవల్ కాల్వ ద్వారా తిమ్మానగర్, మక్తభూపతిపూర్, గుట్టకిందిపల్లి, శివాయిపల్లి, మల్కాపూర్ తండా, వెంకటాపూర్ కొంటూర్ గ్రామాల చెరువులతో పాటు మెదక్ పట్టణంలోని గోసముద్రం, పిట్లంబేస్, బంగ్లా నాయకుని చెరువులు నిండుతాయని తెలిపారు. కాబట్టి వెంటనే కాల్వ మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గత ఏడాది వర్షాలకు పుష్పల వాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయిందని, ప్రస్తుతం మట్టితో తాత్కాలికంగా నిర్మాణం చేపట్టారని తెలిపారు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల పుష్పల వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. హవేలీ ఘనపూర్ మండలంలోని ఘనపూర్ చెరువు, పాతూరు కొచ్చె రువు గండ్లు పడినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదని, వాటిని కూడా వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దొంగల హల్‌చల్

## అర్ధరాత్రి ఆలయంలో దోపిడీకి యత్నం

**వినాయక నగర్, జూన్ 15 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హరియాణా రాష్ట్రానికి చెందిన దోపిడీ ముఠా హల్ చల్ సృష్టించింది. అర్ధరాత్రి ఆలయంలో దోపిడీకి యత్నించారు. మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిబాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని హమాల్ వాడి ప్రాంతంలో గల సాయిబాబా ఆలయంలోకి ఆదివారం అర్ధరాత్రి ముగ్గురు దోపిడీ దొంగలు ఆలయంలో హుండీతో పాటు ఇతర నగలను దొంగిలించేందుకు ప్రయత్నించారు. తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, సుత్తితో ఆలయం డోర్లను ధ్వంసం చేస్తుండగా భారీగా శబ్దం రావడంతో ఆలయం చుట్టుపక్కల ఇళ్లల్లో ఉన్నవారు మేల్కొని వెంటనే డయల్ 100 కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై హరిబాబు, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన ఆలయం వద్దకు చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన దొంగల ముఠా



సభ్యులను పట్టుకున్నట్లు తెలిసింది. ఈ చోరీ ఘటనపై సాయిబాబా ఆలయ పూజారి కృష్ణమాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న

## తాగునీరు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



**మాగనూరు జూన్ 15:** నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల మధ్య నుంచి వెళ్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ కారణంగా వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతుంది. పైప్ లైన్‌లో పగులు ఏర్పడటంతో పంటపొలాల్లో నీరు భారీగా ఎగసిపడుతోం ది.కొం తకాలంగా పైప్‌లైన్‌లో లీకేజీ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికా రులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయలతో నిర్మిం చిన మిషన్ భగీరథ పథకంలో ఇలాంటి లీకేజీల వల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం జరగడమే కాకుండా నీరు వృథా అవుతుందని ఆవేదదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అది,కారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి, నీటి వృథాను అరికట్టాలని కోరుతు న్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను క్రమం తప్ప కుండా తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# అమావాస్య ఎఫెక్ట్ స్కూల్ రీఓపెన్ రోజు

## క్లాస్‌రూంలో ఒంటరిగా పదో తరగతి విద్యార్థిని



వేసవి సెలవులు ముగియడంతో ఇవాళ స్కూళ్లు పునఃప్రారంభమయ్యాయి. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న (బుధవారం), 19న (శుక్రవారం) ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

# చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో

## డ్రైవర్లు మృతి మరొకరికి గాయాలు



**హైదరాబాద్:** మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. జీహెచ్ఎంసీ చెత్త ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు ఆటో డ్రైవర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మంద మల్లమ్మ చౌరస్తాలోని చంద్రా గార్డెన్స్ వద్ద సంతోష్ (26) అనే ఆటో డ్రైవర్ ఆటో రిపేర్ వచ్చి ఆగిపోయింది. దీంతో తన ఆటోను మెకానిక్ షాపునకు తీసుకెళ్లేందుకు సాయం కావాలని తన స్నేహితులు ప్రసాద్, సునీల్ (33)లకు ఫోన్ చేశాడు. వారు మరో ఆటోలో అక్కడకు వచ్చారు. సంతోష్ ఆటోను తమ ఆటోకు తాడుతో కట్టి తరలించేందుకు సునీల్, ప్రసాద్ సిద్ధమయ్యారు. ఈ సమయంలో ఎల్బీ నగర్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్.. రోడ్డు పక్కన ఆగి వున్న ఆటోడ్రైవర్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడిక్కడే మరణించాడు. గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సునీల్ మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గడ్డిమందు మెషిన్‌తో ఆడుకుని

## ముగ్గురు చిన్నారులకు అస్వస్థత

**పెద్దపల్లి రూరల్, జూన్ 15:** పెద్దపల్లి జిల్లా కాసులపల్లి గ్రామంలో గడ్డిమందు పిచికారీ చేసిన మెషిన్‌తో ఆడుకుని ముగ్గురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసులపల్లికి చెందిన ఓ రైతు ఆదివారం తన వ్యవసాయ భూమిలో గడ్డిమందు పిచికారీ చేశాడు. అనంతరం స్ప్రేయర్ మెషిన్‌ను ఇంటికి తీసుకొచ్చి బయట ఉంచాడు. అయితే ఆ మెషిన్‌తో ముగ్గురు చిన్నారులు అకీరా నందన్ (7), కార్తికేష్ (6), రితిక్ (3) ఆడుకున్నారు. ఆ వెంటనే ముగ్గురూ అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు.. స్థానికుల సహకారంతో చిన్నారులను తొలుత పెద్దపల్లి ప్రభుత్వ




ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

# భూపాలపల్లి సింగరేణి గనిలో ప్రమాదం

## బ్లాస్ట్‌లో తెగిపోయిన కార్మికుడి చేతి వేళ్లు

**జయశంకర్ భూపాలపల్లి:** జిల్లాలోని సింగరేణి కేటీకే–5 ఇంక్లైన్‌లో ప్రమాదం జరిగింది. గనిలో బ్లాస్టింగ్‌కు వినియోగించే పూర్ణిని స్కాన్ చేస్తున్న సమయంలో శ్రీరాములు ప్రవీణ్ అనే కార్మికుడి చేతిలో పేలిపోయింది. ఈ ఘటనలో కార్మికుడి చేతి వేళ్లు తీవ్రంగా దెబ్బతిని ఊడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే కార్మికుడిని తోటి కార్మికులు సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ప్రమాదంపై సింగరేణి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గనుల్లో నాసిరకం సామగ్రిని ఉపయోగిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతు



న్నారని మండిపడ్డారు. ఘటనకు గని మేనేజర్ రమేశ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# చిన్నరావులపల్లిలో స్పీడ్ బ్రేకర్లు

## ఏర్పాటు చేయాలి'



**బీబీనగర్, జూన్ 15 :** బీబీనగర్ మండలంలోని చిన్నరావులపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ గోరుగంటి బాలచందర్ కోరారు. ఈ మేరకు భువనగిరి ఆర్అండ్‌బి శాఖ ఈఈ సరితారాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. బీబీనగర్–నాగిరెడ్డిపల్లి ఆర్అండ్‌బి రహదారిలో చిన్నరావులపల్లి గ్రామ రాస్తా వద్ద ప్రమాదకర మూలమలుపు ఉండడంతో వాహనాలు అధిక వేగంతో దూసుకు వస్తున్నాయని తెలిపారు. దీంతో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు సైతం నియంత్రణ కోల్పోయి ఇళ్లలోకి దూసుకెళ్లి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదాల్లో పలువురికి తీవ్ర గాయాలు కాగా, కొందరు మృతి చెందిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పుగా మారిన ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి రాస్తా వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆయన కోరారు.

# ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా



**ధర్మారం, జూన్ 15 :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో ఓ లైన్ ఇన్స్పెక్టర్ నిర్లక్ష్యంతో తాత్కాలిక ఎలక్ట్రికల్ వర్కర్ కట్ట అశోక్ (30) విద్యుత్తు సరఫరా జరిగి మంటల్లో ఖాళీ తీవ్ర గాయాల పాలయ్యాడు. దాదాపు 80 శాతం అతడికి మంటలతో గాయాలు కాగా మొదట చికిత్స కోసం కరీంనగర్ తరలించగా అక్కడ పరిస్థితి విషమించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇటీవల గాలివానతో ఆ గ్రామంలోని బైపాస్ రోడ్డులో కొన్ని విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో అట్టి స్తంభాల మరమ్మతులు, విద్యుత్ తీగలు సరి చేసే పనులను ఆ శాఖ సిబ్బంది పిలుపుమేరకు అదే గ్రామానికి చెందిన అశోక్ తాత్కాలిక ఎలక్ట్రికల్ వర్కర్‌గా గత కొన్ని రోజులుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డులో ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతు పనులు చేయడానికి అశోక్ సోమవారం వెళ్లాడు. అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న లైన్ ఇన్స్పెక్టర్ ఆనంద రావు ధర్మారం సబ్ స్టేషన్ నుంచి ధర్మారం ఫీడర్ కు లైన్ క్లియరెన్స్ ( ఎల్ సి) తీసుకోకుండానే అశోకు ను ట్రాన్స్ ఫార్మర్ ను ఎక్కించాడు. దీంతో అశోక్ ట్రాన్స్ ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలోనే అప్పటికే విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్ తగిలి దానిపైనే పడిపోయాడు. ఈ సంఘటన ఎల్ ఐ కళ్లెదుటే జరిగింది. దీంతో మంటలు చెలరేగి సదరు యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంటల్లో కాలుతున్న విషయాన్ని అక్కడ ఉన్నవారు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వెలుగు చూడగా అది వైరల్ అయింది. షాక్ తగిలిన తర్వాత కరెంటు నిలిచిపోవడంతో బాధితుడిని ట్రాన్స్ ఫార్మర్ నుంచి కిందికి దించగా కాలిన గాయాలతో విలవిలలాడాడు. దీంతో గ్రామస్తులు అతనిని మొదట చికిత్స కోసం కరీంనగర్ లోని ఒక ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అశోక్ కు 80శాతం గాయాలైనట్లు ధృవీకరించినట్లు అతని వెంట ఉన్న స్థానిక సర్పంచ్ మేడారం వీర్ పాల్ తెలిపారు..

# 'అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

**కోదాడ, జూన్ 15 :** చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, బీఆంఎస్ కౌన్సిలర్ చీమ నరేశ్ అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని 9వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. చిన్నారులకు, కిశోర బాలికలకు పౌష్టికారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆటపాటలతో చిన్నారులకు అక్షరాలను నేర్పిస్తున్నందున తమ పిల్లలను కేంద్రానికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సత్యనారాయణ, అంగన్‌వాడీ ఉపా




ధ్యాయురాలు వెంకటరమణ, పి.అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# రిటైర్డ్ టీచర్ కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పద మృతి



**అమరావతి :** ఏపీలోని నెల్లూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విశ్రాంత ఉపాధ్యాయుడుతో పాటు భార్య, కుమారుడు అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని మృతి చెందారు. సంగం మండలం దువ్వూరు గ్రామంలో నివాసముండే విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు (65), అతడి భార్య రత్నావళి ( 60), కుమారుడు సాయిసుకృత్ (25) ఇంటిలో ఉరివేసుకుని చనిపోయారు. అయితే చేతులకు తాళ్లు కట్టేసి ఉండడంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఘటనాస్థలంలో సూసైట్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకున్నారు. మృతికి గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# ఎక్స్‌ప్రెస్‌లో రైలులో చోరీదోపిడీ దొంగలపై పోలీసుల కాల్పులు



**అమరావతి :** ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీకి పాల్పడ్డ దొంగలపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంది. చెంగల్పట్టు నుంచి కాకినాడకు వెళ్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం తెల్లవారుజామున దొంగలు చోరీ కి పాల్పడ్డారు. ప్రయాణికుల నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు.గమనించిన ప్రయాణికులు చైన్ లాగి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. స్పందించిన రైల్వే పోలీసులు దోపిడీ దొంగలపై కాల్పులు జరిపడంతో తప్పించు కుని పారిపోయారు. అయితే అనుమాని తుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# జూన్ 28న తిరుమలలో ఆర్జిత సేవలు రద్దు



**తిరుమల :** ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు తిరుమల లోని శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్టాభిషేకంజరుగనుందని ఆలయ అధికారులు వెల్లడించారు. జ్యేష్టాభిషేకం సందర్భంగా ఈనెల 28 కళ్యాణోత్సవం ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం జ్యేష్టమాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును అభిద్యేయక అభిషేకం అని కూడా అంటారని వెల్లడించారు.తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీన ములైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. మొదటిరోజు శ్రీ మలయప్ప స్వామివారికి ఉన్న బంగారు కవచాన్ని తీసి వేసి, హోమాలు, అభిషేకాలు పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహించిన తరువాత స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారని వివరించారు .రెండవరోజు ముత్యాల కవచం , మూడవ రోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారని తెలిపారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం సమయంలోనే తీస్తారని వెల్లడించారు.

అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవా ల్లో పాల్గొంటారని తెలిపారు.

# విశిష్ట సోమవారాన్ని పురస్కరించుకుని మహాశివుడికి లోకేశ్ దంపతుల రుద్రాభిషేకం

**అమరావతి, జూన్ 15:** ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి ఈ రోజు(సోమవారం) హైదరాబాద్ లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్ట సోమవారాన్ని పురస్కరించుకుని మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రోచ్ఛారణల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పూజల్లో పాల్గొన్నారు.శివారాధనతో పాటు ఆ పరమేశ్వరుడి అనుగ్రహం కోసం లోకేశ్ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం సహా రాష్ట్ర సుభిక్షం కోసం




మహాశివుడిని ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసీపీ మంత్రి ఫరూక్



**అమరావతి, జూన్15:** గొడ్డలి పార్టీ హయాంలో మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బిడ్డలు డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు సాధిస్తే వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. కుంభకర్ణుడిలా 9 నెలలు నిద్రపోయి ఇప్పుడు లేచి డీఎస్సీపై వైసీపీ అధినేత విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ.. కడపలో హజ్ భవన్ నిర్మిస్తే దాన్ని పూర్తి చేయకుండా ఐదేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.మైనార్టీల కోసం కూటమి ప్రభుత్వంలో రూ.5 వేల కోట్లు కేటాయించా మని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హజ్ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తూ మైనార్టీ బిడ్డల చదువుకు తోడ్పడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు వైఎస్ జగన్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తలేనని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలుకు త్వరలోనే హైకోర్టు బెంచ్ తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వంలో 85 శాతం హామీలకు వైఎస్ జగన్ ఎగనామం పెట్టారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 90 శాతం హామీలను అమలు చేసిందన్నారు. ఆస్తుల కోసం తల్లి, చెల్లిని వేధిస్తున్నారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. త్వరలో తల్లి, చెల్లిని జగన్ చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు.

# విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు హోం మంత్రి



**విజయనగరం, జూన్ 15:** జిల్లాలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' జిల్లా స్థాయి విజయోత్సవ సభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'డ్రగ్స్ రహిత రాష్ట్రం' థీమ్‌తో జిల్లాలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా భావిస్తున్నట్లు తెలిపారు.విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడిన జిల్లాలు కాదని.. వెనక ఉండి నడిపించే జిల్లాలని హోం మంత్రి వెల్లడించారు. అతి త్వరలోనే భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని తెలిపారు. ఉత్తరాంధ్రలో గూగుల్ డేటా సెంటర్, స్టీల్ ప్లాంట్ లాంటి ఎన్నో పరిశ్రమలు వచ్చాయన్నారు. నిరుద్యోగ యువతకు వేలాది సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలోనే పింఛనులు అత్యధికంగా ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు.

ఒంటరి మహిళకు, దివ్యాంగులకు, అవ్వ, తాతలకు ఎన్డీఏ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అనిత అన్నారు. అన్నదాత సుఖీభవతో రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే, అంత మంది పిల్లలకు కూడా తల్లికి వందనం ఇచ్చామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. లోకేశ్ పాదయాత్ర చేసే సమయంలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ చాలా ఎక్కువగా కనిపించేవన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో గంజాయిపై ఉక్కు పాదం మోపినట్లు తెలిపారు. ఈగల్ అనే ఒక వ్యవస్థను తీసుకువచ్చామని చెప్పారు.గంజాయి రవాణా చేసిన, సాగు చేసిన, గంజాయి సేవించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి స్పష్టం చేశారు. వారి ఆస్తులను కూడా జప్తు చేస్తున్నామని తెలిపారు. చదువుకున్న వయసులో చిన్న చిన్న తప్పిదాల వలన వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఉద్యోగాలు మీ ఇంటికే వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కోసం మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు త్యాగాలు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా అమర్‌నాథ్ వ్యాఖ్యలు పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, జూన్ 15 :** మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఈరోజు (సోమవారం) విశాఖపట్నం వేదికగా పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ సంస్కారహీన, దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.వైసీపీ నేతల విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి..మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా అమర్‌నాథ్ వ్యాఖ్యలు ఉన్నాయని పల్లా శ్రీనివాసరావు ఆగ్రహించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నేతల మాటల్లో మహిళల పట్ల గౌరవం, బాధ్యత పూర్తిగా లోపించాయని మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. వైసీపీ నేతల విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలని హితవు పలికారు.హోంమంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.భేషరతుగా అనితకు క్షమాపణ చెప్పాలి..అలంకరణ అనేది ఆడవాళ్లకు ఆభరణమని అలాంటి అలంకరణపై అమర్‌నాథ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పుకొచ్చారు. ఒక దళి త మహిళా కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మె ల్యేగా, మంత్రిగా ఎదిగిన అనిత తీరుని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇలా మానసిక క్షోభను గురిచేసే విమర్శలను చేయడం సరికాదని పేర్కొన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని.. భేషరతుగా అనితకు క్షమాపణ చెప్పాలని పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## అమరావతిపై కుల విషం చిమ్మి పబ్బం గడుపుకుంటున్న వైసీపీ నేతలు భూమిరెడ్డి

**అమరావతి, జూన్15:** ప్రజా రాజధాని అమరావతిపై కుల విషం చిమ్మి వైసీపీ నేతలు రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండపడ్డారు. అధికారం కోల్పోయిన నాటి నుంచి వైసీపీ ముఠా నిత్యం కుట్రలు చేస్తుందని విమర్శించారు. సోమవారం రాజధాని అమరావతిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాజధాని అమరావతి అందరిదని స్పష్టం చేశారు. అమరావతి పరిధిలోని 34,323 ఎకరాల్లో అన్ని కులాల వారి భూములు ఉన్నాయని ఆయన వివరించారురాజధాని భూముల్లో ఎస్సీ, ఎస్టీలు 32%, రెడ్లు 23%, బీసీలు 14% ఉన్నారు. ఈ ప్రాంతంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన రైతులు కేవలం 18 శాతమే ఉన్నారని చెప్పారు. అధికారిక లెక్కలు స్పష్టంగా ఉన్నా ఒకే కులానికి అంటగట్టడం వైసీపీ కుట్రలో భాగమన్నారు. జగన్ కుటుంబం మొదటి నుంచి రాజకీయ ఎదుగుదల కోసం కులమతాలను వాడిందని గుర్తు చేశారు.

వ్యక్తుల మధ్య విద్వేషాలు సృష్టించి, హత్యలు చేసి రాజకీయ సౌధాలు నిర్మించుకున్నారని వైఎస్ జగన్ కుటుంబంపై టీడీపీ ఎమ్మెల్సీ నిప్పులు చెరిగారు. నాడు మర్రి చెన్నారెడ్డిని దించడానికి పాతబస్తీలో మతకల్లోలాలు సృష్టించారని వివరించారు. పాతబస్తీ అల్లర్లలో వందలాది మంది సామాన్య ప్రజల మృతికి వైఎస్ జగన్ కుటుంబమే కారణమని విమర్శించారు.

## ఫోన్ ద్వారా డబ్బులు చెల్లిస్తానంటూ మోసం రూ.99 వేల హాంఫట్

**ఎన్టీఆర్, జూన్ 15:** ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లిస్తానంటూ ఓ వ్యక్తి నుంచి ఫోన్ తీసుకున్న మాయగాడు క్షణాల్లో అక్కడి నుంచి పారిపోయాడు. ఆపై ఫోన్ ద్వారా దాదాపు రూ.99 వేల నగదును కాజేశాడు. పట్టణంలోని పాత బస్టాండ్‌లోని ఓ ఎలక్ట్రికల్ షాపునకు ఓ వ్యక్తి వచ్చాడు. అక్కడే కొన్ని సామాన్లు కొనుగోలు చేసిన సదరు వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా బిల్ చెల్లిస్తానని చెప్పాడు. అయితే తన ఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యిందంటూ షాపు యజమానిని ఫోన్ అడిగాడు.ఇంతలో ఆ యజమానికి ఓ నంబర్ ఇచ్చి దానికి ఒక్క రూపాయి పంపమని కోరాడు. అతను చెప్పిన నంబర్‌కు ఫోన్ పే ద్వారా ఒక్క రూపాయి పంపించాడా యజమాని. అయితే.. ఫోన్‌పే ఎలా ఉపయోగిస్తున్నాడో ఆ వ్యక్తి గమనించి.. పిన్ నంబర్ నోట్ చేసుకున్నాడు. ఆపై అవతలి వ్యక్తికి కాల్ చేసి రూపాయి వచ్చిందో, లేదో తెలుసుకుంటానని చెప్పి యజమాని నుంచి ఫోన్ తీసుకున్నాడా కేటు



గాడు. వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో షాపు యజమాని షాక్‌కు గురయ్యాడు. కేటుగాడు.. షాప్ యజమాని ఫోన్‌పే ఖాతా ద్వారా సుమారు రూ.99,000 వరకు లావాదేవీలు జరిపాడు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం సహా తన బ్యాంక్ ఖాతాలను నిలిపివేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.